
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు

శుక్రవారం 22 మార్చి 2024



ఎన్నికలు ముగిసే వరకు స్పందన రద్దు

పాడేరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఐటీడీఏ కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని కలెక్టర్ విజయసునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అందువల్ల ప్రజలు తమ సమస్యలపై అధికారులకు వినతులు సమర్పించేందుకు ఐటీడీఏ కార్యాలయానికి రావద్దని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తరువాత మాత్రమే స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లాలోని ప్రజలు గమనించాలని కోరారు.

ఉపాధి అందించే డ్రాగన్ ఫ్రూట్

ఈ పథకం కింద మన్యంలో తొలిసారిగా సాగు

- ప్రయోగాత్మకంగా జిల్లాలో 14.5 ఎకరాల్లో పంట
- లబ్ధిదారులకు శత శాతం రాయితీ
- మూడేళ్ల తరువాత ఎకరానికి ఏడాదికి రూ.2.25 లక్షల ఆదాయం



(ఆంధ్రజ్యోతి- పాడేరు)

జాతీయ ఉపాధి హామీ పథకం కింద మన్యంలో తొలిసారిగా డ్రాగన్ ఫ్రూట్ సాగును అధికారులు ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటి వరకు ఈ పథకం కింద చెరువులు, కుంటలు తవ్వడం, రోడ్లు వేయడమే ఉండగా, ఈ ఏడాది అందుకు భిన్నంగా గిరిజన రైతులకు శాశ్వత ఆదాయం లభించేలా డ్రాగన్ ఫ్రూట్ సాగును ప్రయోగాత్మకంగా పరిచయం చేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 29 మంది లబ్ధిదారులతో 14.5 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగుకు శ్రీకారం చుట్టారు. సాగుకు అవసరమైన సామగ్రి, పరికరాలు సైతం గిరిజన రైతులకు ఉచితంగా అందించడంతో పాటు మూడేళ్ల సాగుకు అవసరమైన ప్రోత్సాహాన్ని అందిస్తారు.



స్తంభానికి కిందన నాటిన డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు

ఏజెన్సీలో జాతీయ ఉపాధి హామీ పథకంలో డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేపట్టడం ఇదే తొలిసారి. ప్రయోగాత్మకంగా ఆసక్తి వున్న 29 మంది గిరిజన రైతులతో జిల్లా వ్యాప్తంగా 14.5 ఎకరాల్లో సాగు ప్రారంభించారు. జిల్లా లో చింతపల్లి మండలంలో 6 ఎకరా ల్లో 12 మంది లబ్ధిదారులు, ముంచంగిపుట్టులో 3 ఎకరాల్లో ఆరుగురు, వై.రామవరంలో అర ఎకరంలో ఒకరు, డుంబ్రిగుడలో 2 ఎకరాల్లో నలుగురు, కొయ్యూరు, జి.మాడుగుల ప్రాంతాల్లో ఎకరంన్నర చొప్పున ... మిగతా 8వ పేజీలో



ముంచంగిపుట్టు మండలం బుంగాపుట్టులో డ్రాగన్‌ఫ్రూట్ మొక్కల పెంపకానికి వేసిన స్తంభాలు

వేసవిలో మంచు కురిసె..

పాడేరులో గురువారం ఉదయం పొగమంచు దట్టంగా కురిసింది. వేసవిలోనూ మంచు కురవడం విశేషం. వాతావరణంలో మార్పు కారణంగా బుధవారం సాయంత్రం ఏజెన్సీలో జల్లులతో కూడిన వర్షం కురిసింది. దీంతో గురువారం ఉదయం తొమ్మిది గంటల వరకు శీతాకాలాన్ని తలపించే వాతావరణం నెలకొంది. లైట్లు వేసుకుని వాహనాలు రాకపోకలు సాగించాయి.

- ఆంధ్రజ్యోతి/పాడేరు



పాడేరులో గురువారం ఉదయం పొగమంచు

వలంటీర్లతో రహస్య భేటీలు!

తాజాగా పాడేరు సమీపంలోని ఓ కొండపై వారితో సమావేశమైన వైసీపీ నేతలు

- ఐప్యాక్ టీమ్‌తో వారికి ఎన్నికల వ్యూహాలు బోధన
- ఎన్నికల కమిషన్ ఆదేశాలు బేఖాతర్
- అధికారులు దృష్టి పెట్టకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురి ఆరోపణ

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

ఎన్నికలు, రాజకీయ సంబంధ అంశాలకు దూరంగా ఉండాలని గ్రామ వలంటీర్లకు ఎన్నికల సంఘం ఎన్నిహెచ్చరికలు చేస్తున్నప్పటికీ వైసీపీ నేతలు బేఖాతర్ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పథకం ప్రకారం తమకు అనుకూలంగా వున్న వారినే గ్రామ వలంటీర్లుగా నియమించిన వైసీపీ నేతలు, ఎన్నికల్లో వాళ్లను వినియోగించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే వలంటీర్లతో వైసీపీ నేతలు రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నారు.

బహిరంగంగా కలిసి తిరిగితే ఎవరైనా గుర్తిస్తారని భావించి, ఎవరి కంట పడకుండా వలంటీర్లతో రహస్యంగా కొండలు, గుట్టలపై వైసీపీ నేతలు సమావేశమవుతున్నారు. తమ పరిధిలో ఉన్న ఓటర్లంతా రానున్న ఎన్నికల్లో వైసీపీకే ఓట్లు వేసేలా చూడాలని కోరుతున్నారు. అలాగే వలంటీర్లు సైతం వైసీపీకి చెందిన వాళ్లే కావడంతో అందుకు అనుగుణంగా అడుగులు వేస్తున్నారు. ఇటీవల పాడేరు మండలానికి సమీపంలో జి.మాడుగుల వెళ్లే మార్గంలోని ఓ కొండపై వైసీపీ నేతలు వలంటీర్లతో రహస్య సమావేశం నిర్వహించడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

ఐప్యాక్ టీమ్‌తో కలిసి ఎన్నికల వ్యూహాలు

రానున్న ఎన్నికల్లో వైసీపీ గెలుపునకు వలంటీర్లు ఎటువంటి పాత్ర పోషించాలనే దానిపై ఈ రహస్య సమావేశంలో ఐప్యాక్ టీమ్ సభ్యులు వివరించినట్టు తెలిసింది. వైసీపీ నేతలు వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేసి, దానికి ఐప్యాక్ టీమ్ సభ్యులను సైతం ఆహ్వానిస్తున్నారు. దీంతో టీమ్ సభ్యులు వలంటీర్ల పరిధిలో ఉండే ఓటర్లతో ఎలా మాట్లాడాలి?, వైసీపీకే ఓటు వేసేలా ఎలా ఒప్పించాలనే అంశాలను వారికి తెలుపుతున్నట్టు తెలిసింది. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను ఐప్యాక్ టీమ్‌తో బోధిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా యంత్రాంగం ఎన్నికలకు సంబంధించి అధికార యంత్రాంగాన్ని సన్నద్ధం చేసే పనిలో ఉండడంతో పాటు గ్రామ సచివాలయ సిబ్బంది సైతం వలంటీర్ల కదలికలపై ఉన్నతాధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడంతో వైసీపీ నేతల రహస్య సమావేశాల ఘటనలు అధికారుల దృష్టికి రావడం లేదు. పైగా ఏజెన్సీలో అధికంగా మారుమూల ప్రాంతాలు ఉండడం, వార్డు సభ్యుడు మొదలుకుని పార్లమెంట్ సభ్యుడు వరకు అంతా వైసీపీకి అనుకూలమైన వాళ్లే ఉండడంతో వలంటీర్లకు వ్యతిరేకంగా అధికారులకు ఫిర్యాదులు చేయని పరిస్థితి నెలకొంది. దీంతో ఎన్నికల కమిషన్ ఆదేశాలను సైతం పక్కన పెట్టి వలంటీర్లు వైసీపీ నేతలతో కలిసి గుట్టుచప్పుడు కాకుండా ఎన్నికల ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

మన్యంలో వలంటీర్లపై నిఘా శూన్యం

ఎన్నికల కోడ్ అమల్లో వున్నా, ఎన్నికల కమిషన్ పలుమార్లు ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ ఏజెన్సీలో గ్రామ వలంటీర్లపై అధికార యంత్రాంగం నిఘా మాత్రం శూన్యమనే చెప్పాలి. జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు ఎన్నికలకు సంబంధించిన సమావేశాలు, సిబ్బందిని సన్నద్ధం చేయడం, పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు వంటి అంశాలపై దృష్టిపెడుతున్నారు. ఫలితంగా వలంటీర్లపై అధికారులు దృష్టిపెట్టని పరిస్థితి నెలకొంది. దీంతో ఇదే అదనుగా వలంటీర్లు ఎన్నికల కమిషన్ ఆదేశాలకు లోబడి ఉండడం లేదు. ఇప్పటికైనా కోడ్ ఉల్లంఘిస్తున్న వలంటీర్లపై అధికారులు ఓ కన్నేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కళ్లు తేలేస్తున్న కోళ్లు

మన్యంలో కొక్కెర తెగులుతో మృత్యువాత

- వ్యాధి సోకిన కోళ్ల నుంచి విస్తృతంగా వ్యాప్తి
- మరణించిన వాటిని తినకూడదు
- లక్షణాల ఆధారంగా నివారణ చర్యలు చేపట్టాలి
- కేవీకే పశువైద్య శాస్త్రవేత్త విజయ రాజ్ఞి

చింతపల్లి, మార్చి 21:

వాతావరణంలో కలిగిన మార్పు వల్ల గిరిజన ప్రాంతంలో ఆదివాసీలు పెంచుకుంటున్న పెరటి కోళ్లు కొక్కెర తెగులు(రానికెట్)తో మృత్యువాత పడుతున్నాయి. సాధారణంగా శీతాకాలం నుంచి వేసవిలోకి ప్రవేశించే సమయంలో వైరస్ కారణంగా కోళ్లు ఈ వ్యాధి బారిన పడుతుంటాయి. ఈ తెగులును ఈ ప్రాంతవాసులు కునుకుడు వ్యాధి అని పిలుస్తారు.

ప్రస్తుతం చింతపల్లి, జీకేవీధి పరిధిలోని గిరిజన గ్రామాల్లో వారం రోజులుగా పెరటి కోళ్లు కొక్కెర తెగులుతో మృతి చెందుతున్నాయి. దీంతో ఆదివాసీ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా కొక్కెర తెగులు లక్షణాలు, నివారణకు తీసుకోవలసిన చర్యలపై హరిపురం కృషి విజ్ఞాన కేంద్రం పశువైద్య శాస్త్రవేత్త డాక్టర్ విజయ రాజ్ఞి పలు వివరాలు వెల్లడించారు.



అద్దరవీధిలో కొక్కెర తెగులు బారిన పడిన నాటు కోడి

కొక్కెర తెగులు

పెరటి కోళ్లలో ప్రధానంగా కొక్కెర తెగులు అధికంగా కనిపిస్తుంది. ఈ వ్యాధి పారామిక్సో వైరస్ వల్ల వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి కోళ్లకు వ్యాప్తి చెందే తెగుళ్లలో ప్రమాదకరమైనది. ఒక కోడికి ఈ వ్యాధి సోకితే ఇతర కోళ్లకు సులభంగా వ్యాప్తి చెందుతుంది. ఒకేసారి అధిక కోళ్లకు ప్రాణ నష్టం కలిగిస్తుంది. వ్యాధి సోకిన కోళ్ల రెట్టలు, ముక్కు, నోటి నుంచి కారే స్రవాల వల్ల ఆరోగ్యవంతమైన కోళ్లకు కూడా ఈ వ్యాధి సోకుతుంది.



కోడి పిల్ల కంటికి లసోట(ఎఫ్1) టీకా వేస్తున్న దృశ్యం (ఫైల్ ఫొటో)

వ్యాధి లక్షణాలు

కొక్కెర తెగులు వ్యాప్తి చెందిన కోళ్లు ముడుచుకుని రెక్కలు వేలాడిపోతాయి. ముఖం ఉబ్బి నీలి రంగులోకి మారుతుంది. ముక్కు నుంచి నీరు కారుతుంది. కోళ్లు గుడ్లు పెట్టడం మానేస్తాయి. మెడ వాలిపోవడం, కాళ్లు, రెక్కలు పడిపోవడం జరుగుతుంది. ఈ వ్యాధికి గురైన కోళ్లు పల్చగా తెలుపు, ఆకుపచ్చ రంగులో రెట్ట వేస్తుంది. కోడి బాగా నీరసపడి మృతి చెందుతుంది. ఈ వ్యాధితో ... మిగతా 8వ పేజీలో

ఏప్రిల్ నుంచి కోళ్లకు టీకాలు



పశువైద్యశాలలు, ఆర్‌బీకేల ద్వారా ఏప్రిల్ నుంచి కోళ్లకు ఉచితంగా లసోట(ఎఫ్1) టీకాలు వేస్తారు. పెరటి కోళ్ల పెంచుకుంటున్న రైతులు విధిగా ఈ టీకాలు వేయించాలి. ఈ టీకాలు వేయించడం వల్ల కొక్కెర తెగులును నియంత్రించవచ్చు. ఇప్పటికే ఈ వ్యాధి సోకిన కోళ్లకు హోమియో చికిత్స అందించడం వల్ల ప్రాణ నష్టం నుంచి కాపాడుకోవచ్చు.

- **డాక్టర్ విజయ రాజ్ఞి,** పశువైద్య శాస్త్రవేత్త, కేవీకే, హరిపురం

జగనన్న.. పార్లే ప్రాజెక్టు ఎక్కడన్నా??

సముద్ర తీరాన్ని ప్లాస్టిక్ రహితంగా మారుస్తామంటూ రెండేళ్ల కిందట ఆర్భాటం



- వ్యర్థాల పునర్వినియోగానికి ప్రతిపాదన
- 2022 ఆగస్టులో 'పార్లే ఫర్ ది ఓషన్స్' సంస్థతో ఒప్పందం
- ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి తయారైన ముడిసరకుతో రూపొందించిన కళ్లజోడు ధరించి మురిసిపోయిన సీఎం జగన్
- రూ.16 వేల కోట్ల పెట్టుబడులు, 20 వేల మందికి ఉద్యోగ అవకాశాలు అంటూ ప్రకటన
- ఏడాదిన్నరైనా కానరాని పురోగతి



సీఎం జగన్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మి, పార్లే సంస్థ ప్రతినిధి (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సముద్ర తీరాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చడంతో పాటు...సేకరించిన వ్యర్థాలతో దుస్తులు, కళ్లద్దాలు, బూట్లు వంటి వాటిని తయారుచేసేందుకు అమెరికాకు చెందిన 'పార్లే ఫర్ ది ఓషన్స్' సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం 2022 ఆగస్టు 27న ఒప్పందం చేసుకుంది. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి స్వయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో ఆ సంస్థ తయారుచేసిన వస్తువులను పట్టుకుని హడావుడి చేశారు. అయితే ఏడాదిన్నర గడిచిపోయినా ఆ ప్రాజెక్టు మాత్రం పట్టాలెక్కలేదు.

ప్రస్తుతం ఎక్కడచూసినా ప్లాస్టిక్ వస్తువులే కనిపిస్తున్నాయి. ప్రజలు ప్లాస్టిక్‌ను వాడేసిన తర్వాత కాలువలు, గెడ్డల్లో పడేస్తున్నారు. అవి నేరుగా సముద్రంలోకి చేరుకుంటున్నాయి. తీరంతోపాటు జలాలు కూడా కలుషితం అయిపోతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలోకి చేరడం వల్ల 267 రకాల జీవజాతుల మనుగడ దెబ్బతింటోంది. ఈ నేపథ్యంలో సముద్ర తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించడంతో పాటు వాటి రీసైక్లింగ్ చేయడం ద్వారా సమస్యను పరిష్కరించవచ్చునని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. దీనికోసం ప్లాస్టిక్ వ్యర్థాలతో అనేక రకాల ఉత్పత్తులను తయారుచేసే అమెరికాకు చెందిన ఎన్‌జీవో 'పార్లే ఫర్ ది ఓషన్స్', గ్లోబల్ అలయెన్స్ ఫర్ సస్టైనబుల్ ప్లానెట్ వర్క్స్ (జీఏఎస్‌పీ) అనే రెండు సంస్థలను సంప్రతించింది. ఆ సంస్థలు కూడా ముందుకు రావడంతో 2022 ఆగస్టు 27న ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించడానికి జీవీఎంసీ భారీగా డబ్బులు ఖర్చు చేసింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయన సమక్షంలోనే ప్రభుత్వం తరపున పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి...సంబంధిత సంస్థల ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్మోహన్‌రెడ్డి ... మిగతా 7వ పేజీలో

ఎన్నికల నిబంధనల అమలుకు సహకరించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత

· 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్ర)	6.12
సహరి (శని)	4.46

చింతగరువు ఘాట్‌లో ఆటో బోల్తా

- 8 మందికి గాయాలు



చింతగరువు ఘాట్‌లో బోల్తాపడిన ఆటో (ఇన్‌సెట్‌లో) గాయపడిన మహిళ

పెదబయలు, మార్చి 21: మండలంలోని మారుమూల గిన్నెలకోట పంచాయతీ చింతగరువు ఘాట్‌లో గురువారం మధ్యాహ్నం ఓ ఆటో బోల్తా పడింది. ఆటోలో ఉన్న ఎనిమిది మందికి గాయాలయ్యాయి. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. పెదబయలు మండలం గిన్నెలకోట పంచాయతీ చింతగరువు గ్రామానికి చెందిన గిరిజనులు జి.మాడుగుల మండలం మద్దిగరువులో జరుగుతున్న వారపు సంతకు ఆటోలో బయలుదేరారు. చింతగరువు ఘాట్‌రోడ్డులో వెళుతున్న క్రమంలో గొంకురాయి వద్ద ఆటో బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దీంతో ఆటో బోల్తా పడింది. ఆటోలో పది మంది ప్రయాణికులు ఉండగా ఏడుగురికి స్వల్పంగా, ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను జి.మాడుగుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

రూ.2.7 లక్షల నగదు స్వాధీనం

- ఎన్నికల నిబంధనల నేపథ్యంలో పోలీసుల తనిఖీలు

పాడేరురూరల్, మార్చి 21: ఎన్నికల నిబంధనల్లో భాగంగా వాహనాల తనిఖీలు చేపట్టి బుధవారం రాత్రి రూ.2.7 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ జి.లక్ష్మణరావు తెలిపారు. దీనికి సంబంధించి గురువారం ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని వంతాడపల్లి చెక్‌గేట్ వద్ద పోలీసులు బుధవారం రాత్రి వాహనాల తనిఖీలు చేపట్టారు. అనకాపల్లి జిల్లా వడ్డాది మాడుగుల మండలం డి.గొటివాడ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వస్తుండగా వారిని ఆపి తనిఖీలు చేశారు. వారి వద్ద రూ.2.7 లక్షల నగదు ఉండడం, దీనికి సంబంధించి ఎటువంటి పత్రాలు లేకపోవడంతో ఆ నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆ నగదును జిల్లా కమిటీ ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంకులో ఉంచామని, సరైన పత్రాలు చూపిస్తే సంబంధిత వ్యక్తులకు అప్పగిస్తామని ఎస్ఐ తెలిపారు.



వంతాడపల్లి చెక్ గేట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

క్రైం... crime news

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఎలమంచిలి, మార్చి 21: ఎలమంచిలి రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం పట్టాలు దాటుతుండగా ఓ రైలు ఢీకొనడంతో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు తుని రైల్వే ఎస్ఐ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. ఎలమంచిలి నుంచి తుని వైపు వెళుతున్న రైలు ఢీకొట్టడంతో తలకు బలమైన గాయం కావడంతో అతను అక్కడికక్కడే మృతి చెందినట్టు ఎస్ఐ చెప్పారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ తన సిబ్బందితో పరిశీలించారు. మృతునికి సుమారు 56 సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఎరుపు రంగుపై సిమెంట్ రంగు గడులు కలిగిన ఆఫ్ చేతులు చొక్కా, నలుపు రంగు మీద తెలుపు రంగు సన్నని చారలు కలిగిన ఫుల్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడని, అతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించామని తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు తుని రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

అనకాపల్లి టౌన్, మార్చి 21: ప్రమాదంలో గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఓ వృద్ధురాలు గురువారం ఉదయం మృతి చెందినట్టు పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. స్థానిక లక్ష్మీదేవిపేటకు చెందిన చింతకాయల లక్ష్మి(63) ఈ నెల 16వ తేదీన ఇంట్లోని బాత్‌రూములో కాలుజారి పడిపోయింది. తలకు బలమైన గాయం తగలడంతో కుటుంబసభ్యులు ఎన్టీఆర్ వైద్యాలయంలో చికిత్స నిమిత్తం చేర్పించగా, ప్రథమ చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తరలించారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం ఆమె మృతి చెందింది. ఆమె కుమార్తె వి.భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

తేనెటీగల దాడిలో ఒకరికి తీవ్రగాయాలు

రావికమతం, మార్చి 21: తేనెటీగల దాడిలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మండలంలోని మేడివాడలో జరిగింది. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం.. మేడివాడ గ్రామానికి చెందిన బండారు గోవింద్ చింతబొట్లు కోసం మెయిన్ రోడ్డు సమీపంలో ఉన్న చింత చెట్టు ఎక్కాడు. అప్పటికే చెట్టు కొమ్మకు తేనెపట్టు వుంది. దీనిని గమనించని గోవింద్.. చింతబొట్లు దులిపేందుకు కొమ్మను బలంగా ఊపాడు. దీంతో తేనెటీగలు ఒక్కసారిగా గోవింద్‌పై దాడిచేశాయి. తీవ్రగాయలై సొమ్మసిల్లి పడిపోయాడు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం నర్సీపట్నం ఆస్పత్రికి తరలించారు.

గంజాయి కేసులో ఐదుగురి అరెస్టు

- ఐదు వాహనాలు సీజ్.. మరో ఆరుగురి కోసం గాలింపు

విశాఖపట్నం, మార్చి 21: రెండు రోజుల క్రితం కొత్తపాలెంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు గంజాయి పట్టుకున్న కేసులో ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు డీసీపీ-2 ఎం.సత్తిబాబు మంగళవారం కేసు వివరాలను వెల్లడించారు. చీడికాడ మండలం భైలపూడి గ్రామానికి చెందిన గాడి సంతోశ్, విశాఖ పూర్ణామార్కెట్‌కు చెందిన గుమ్మాల పైడిరాజు, ఎర్రా మౌళి, సీతమ్మధారకు చెందిన నారికేళం గణపతి, కొత్తపాలేనికి చెందిన రాపేటి నూకేశ్‌లు తమకు పరిచయస్తులైన పవన్, ఆనంద్, త్రినాథ్ అనే వ్యక్తులతో కలిసి విశాఖ ఏజెన్సీలో ఇద్దరు వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేశారు. దీనిని కొత్తపాలెంలో నూకేశ్ బంధువు నిర్వహిస్తున్న టిఫిన్ షాపులో నిల్వ చేశారు. దీనిపై సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆ షాపుపై దాడి చేసి 110 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని గోపాలపట్నం పోలీసులకు అప్పగించారు. గంజాయి రవాణా చేస్తున్న సంతోశ్, పైడిరాజు, మౌళి, గణపతి, నూకేశ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ఆరుగురి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్టు డీసీపీ తెలిపారు. గంజాయి తరలించడానికి వినియోగించిన మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, ఒక కారును సీజ్ చేశామన్నారు. గంజాయి నిల్వ చేసిన టిఫిన్ షాపును కూడా సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.

20 లీటర్ల సారాతో ఒకరి అరెస్టు

గొలుగొండ, మార్చి 21: మండలంలోని సీతకండి గ్రామంలో 20 లీటర్ల సారాతో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. కొయ్యూరు మండలం రెల్లపాలెం గ్రామానికి చెందిన దూరి బోడేసు, సీతకండి శివారులో నాటుసారా కొనుగోలు చేసి, తన గ్రామంలో విక్రయించడానికి తీసుకెళుతున్నాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు దారిలో అటకాయించి బోడేసు వద్ద నుంచి 20 లీటర్ల నాటుసారాను సాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రెండు వారాలపాటు రిమాండ్ విధించారు.

కోడి పందేలపై పోలీసులు దాడి, ఏడుగురి అరెస్టు

బుచ్చెయ్యపేట, మార్చి 21: మండలంలో నీలకంఠాపురంలో కోడి పందేల శిబిరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. కోడి పందేలు ఆడుతున్న ఏడుగురుని అరెస్టు చేసి, రెండు కోడి పుంజులు, రూ.4,700 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు.

అక్రమంగా నిల్వ చేసిన రసాయనాలు స్వాధీనం

పరవాడ, మార్చి 21: ఎటువంటి అనుమతులు లేకుండా రసాయనాల డ్రమ్ములను తోటల్లో నిల్వ చేసిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు దాడి చేసి 80 రసాయనాల డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి పరవాడ సీఐ బాలసూర్యారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాయుడుపాలెం పంచాయతీ పరిధి తమ్మయ్యపాలెం గ్రామానికి చెందిన పైలా జగదీశ్వరరావు కొంతకాలంగా ఇదే గ్రామానికి చెందిన చీపురుపల్లి దేముడు అనే వ్యక్తికి చెందిన కొబ్బరి తోటల్లో వ్యర్థ రసాయనాల డ్రమ్ములను నిల్వ చేసి విక్రయాలు సాగిస్తున్నాడు. ఈ వ్యవహారం కొంతకాలం పాటు గుట్టు చప్పుడు కాకుండా సాగింది. వ్యర్థ రసాయనాల కారణంగా విపరీతమైన దుర్వాసన రావడంతో స్థానికులు పోలీస్, రెవెన్యూ సిబ్బందికి సమాచారమిచ్చారు. దీంతో ఎస్ఐ సురేశ్, వీఆర్వో కమల తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. థైనాల్‌క్లోరైడ్ 60 డ్రమ్ములు (ఎనిమిది వేల కేజీలు), మిక్సిడ్ సాల్వెంట్ 20 డ్రమ్ములు (మూడు వేల కేజీలు) ఉన్నట్టు గుర్తించారు. ఫార్మాసిటీ, ఎస్ఈజెడ్‌లో గల ఫార్మా పరిశ్రమల నుంచి తక్కువ ధరకు ఈ రసాయనాలు కొనుగోలు చేసి వీటిని ఎక్కువ ధరకు అమ్ముతున్నట్టు తెలిసింది. ఏయే పరిశ్రమల నుంచి కొనుగోలు చేసి ఇక్కడకు తీసుకువస్తున్నారో అనే దానిపై కూడా విచారణ చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం నిర్వాహకుడు జగదీశ్వరరావును అదుపులోకి తీసుకుని వివరాలను సేకరిస్తున్నామని సీఐ వెల్లడించారు.

20 మద్యం బాటిళ్లు స్వాధీనం

కశింకోట, మార్చి 21: కశింకోట రైల్వేగేటు వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు అనకాపల్లి మండలం రామాపురం కాలనీకి చెందిన మురుగుతి రాజు నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కొనుగోలు చేసి తీసుకెళుతున్నట్టు అతను చెప్పాడని హెచ్‌సీ సూర్యారావు చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

10 బీరు బాటిళ్లు స్వాధీనం

కొత్తూరు, మార్చి 21: అనకాపల్లి మండలం గోపాలపురంలో యిళ్ల రవి అనే వ్యక్తి నడుపుతున్న షాపు (మద్యం బెల్టు షాపు)లో రూరల్ పోలీసులు గురువారం తనిఖీ చేశారు. పది బీరు సీసాలను స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపారు.

వలంటీరు తీరుపై ఆర్వోకు టీడీపీ నేత ఫిర్యాదు

ఎలమంచిలి, మార్చి 21: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఫొటోను మార్ఫింగ్ చేసి అసభ్యకర సందేశాలను గ్రూపుల్లో పంపుతున్న 25వ వార్డు పరిధిలోని వలంటీర్ డి.భాస్కరరావుపై ఎలమంచిలి రిటర్నింగ్ అధికారికి గురువారం ఫిర్యాదు చేసినట్టు టీడీపీ పట్టణ కార్యదర్శి ఆడారి వెంకటరమణబాబు తెలిపారు. నిబంధనల ప్రకారం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎలమంచిలి రిటర్నింగ్ అధికారిణి మనోరమను ఫోన్‌లో వివరణ అడుగగా ఈ ఫిర్యాదును సైబర్ క్రైమ్ అధికారులకు బదిలీ చేశామన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439



స్వామివారి కల్యాణం సందర్భంగా మంగళసూత్రాలను చూపుతున్న పురోహితులు, కల్యాణ వేడుకను తిలకిస్తున్న భక్తులు

కల్యాణ వైభోగమే..

- నేత్రపర్వంగా ఉపమాక వెంకన్న కల్యాణోత్సవం
- ముందుగా ఎదురు సన్నాహోత్సవం
- తదుపరి రథోత్సవం



నక్కపల్లి, మార్చి 21: ఉపమాక వెంకన్న వార్షిక కల్యాణోత్సవ ఘట్టం బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తులు స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు. కల్యాణోత్సవంలో భాగంగా బుధవారం రాత్రి 11 గంటలకు ఎదురు సన్నాహ మహోత్సవం జరిగింది. ఇత్తడి గరుడ వాహనంపై పసిడి ఆభరణాలతో స్వామివారు, ఇత్తడి గజ వాహనంపై ఉభయదేవేరులను అలంకరించి మాడవీధుల్లో ఊరేగించారు. ఎదుర్కోలు ఉత్సవంలో భాగంగా వధూవరుల గుణగణాలు, పెండ్లిచూపులు, పెండ్లిమాటలు వంటి తంతును ప్రముఖ వేదపండితురాలు డాక్టర్ గాయత్రీదేవి అద్భుతంగా భక్తులకు వివరించారు. బంగారు ఆభరణాలు, వజ్ర వైఢూర్యాలతో స్వామివారిని, అమ్మవారిని ఊరేగించడంతో డీఎస్పీ మోహన్, సీఐలు విజయ్‌కుమార్, అప్పన్న నేతృత్వంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం స్వామివారిని రథంపై అలంకరించి మాడవీధుల్లో ఊరేగించారు.

కల్యాణ శోభ

రథోత్సవం అనంతరం బుధవారం అర్ధరాత్రి 2 గంటల తరువాత ఆలయ ప్రధాన రాజగోపురం పక్కన ఏర్పాటు చేసిన వేదిక వద్ద శ్రీవారి కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు, వేదపండితుల బృందం నిర్వహించింది. పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం స్వామివారి వార్షిక కల్యాణోత్సవాన్ని ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, నర్సింహాచార్యులు, సాయిగోపాలాచార్యులు, నండూరి రాజగోపాలాచార్యులు జరిపించారు. కాగా జిల్లా వ్యాప్తంగా బుధవారం వర్షం కురవగా ఉత్సవాలకు ఆటంకం కలుగుతుందని భక్తులు, ఆలయ అధికారులు ఆందోళన చెందారు. అయితే బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజామున స్వామివారి కల్యాణం జరిగే వరకు ఒక్క చినుకు కూడా కురవలేదు. దీంతో ఎప్పటిలాగా ఉత్సవాలన్నీ భక్తుల సమక్షంలో ఘనంగా జరిగాయి. స్వామివారు మహిమాన్వితుడని, అందుకే ఉత్సవానికి ఆటంకం కలగలేదని పలువురు భక్తులు చర్చించుకున్నారు.

ముందు ఫోన్ పెట్టెయ్...

- రహదారి గురించి ఫోన్ చేసిన గ్రామస్థుడికి దురుసుగా ఎమ్మెల్యే కన్నబాబురాజు సమాధానం
- సోషల్ మీడియాలో వైరల్

అచ్యుతాపురం, మార్చి 21: తమ గ్రామానికి రోడ్డు వేయాల్సిందిగా ఫోన్ చేసిన వ్యక్తికి అనకాపల్లి జిల్లా ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు దురుసుగా సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం ఈ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళితే...అచ్యుతాపురం మండలం ఆవరాజాం గ్రామానికి రోడ్డు సగంవేసి వదిలేశారు. గ్రామస్థుడు ఒకరు...కన్నబాబురాజుకు ఫోన్ చేసి రహదారి నిర్మాణం పూర్తి చేయించాల్సిందిగా కోరారు. అందుకు ఆయన 'ఫోన్ పెట్టు' అంటూ దురుసుగా సమాధానం ఇచ్చారు.

కన్నబాబురాజు: హలో ఎవరు..
గ్రామస్థుడు: ఆవరాజాం నుంచి మాట్లాడుతున్నాను సార్:
కన్నబాబు రాజు: ఆ..
గ్రామస్థుడు: సార్..ఏంటండి. మా గ్రామానికి రోడ్డు సగం వేసి ఆపేస్తున్నారు.
కన్నబాబురాజు: పెట్టు ఫోను
గ్రామస్థుడు: సార్..
కన్నబాబురాజు: పెట్టు ఫోన్, పెట్టు ఫోన్
గ్రామస్థుడు: ఏంటి సార్...మామూలుగా మాట్లాడుతుంటే అలాగంటారు.
కన్నబాబురాజు: ఆ...
గ్రామస్థుడు: మామూలుగా మాట్లాడుతుంటే ఫోన్ పెట్టేమంటున్నారు.
కన్నబాబురాజు: సగం వేసి ఆపేస్తే నువ్వెవరివి చెప్పడానికి...
గ్రామస్థుడు: అదికాదు సార్...పూర్తిగా వేస్తే బాగుంటుంది కదా
కన్నబాబురాజు: ఆ...సరెసరె మంచిదమ్మ. ఫోన్ పెట్టు.
గ్రామస్థుడు: సార్ ఆలాగంటారేంటండి
కన్నబాబురాజు: ఫోన్ పెట్టమని చెప్పానా....
గ్రామస్థుడు: అలాగైతే మీరే పెట్టేయండి...

ప్రస్తుతం ఈ వాయిస్ రికార్డు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఎన్నికలు దగ్గర పడుతున్నా కన్నబాబురాజు తన దురుసు ప్రవర్తన మానుకోలేదని ప్రజలు బహిరంగంగానే అంటున్నారు. గతంలో గడప గడపకు కార్యక్రమంలోకూడా కన్నబాబు రాజు ఇదే విధంగా ప్రవర్తించారు.

మాజీ ఎమ్మెల్యే ఇంట్లో దోపిడీ

- రాత్రి ఏడున్నర గంటల సమయంలో గేటు దూకి ఇంట్లోకి చొరబడిన దుండగుడు
- ఆయన భార్య మెడపై కత్తిపెట్టి బెదిరింపు
- మెడలోని బంగారం, బీరువాలోని
- నగదు, బంగారం తీసుకుని ఉండాయింపు


సీసీ టీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్న పోలీసులు

విశాఖపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ ఇంట్లో గురువారం రాత్రి దోపిడీ జరిగింది. తైనాల ఎస్.కోటలో ఎన్నికల ప్రచారానికి వెళ్లగా, ఇంట్లో ఆయన భార్య ఒక్కరే ఉన్నారు. ఆమెను దుండగుడు కత్తితో బెదిరించి సుమారు రూ.8 లక్షల నగదుతోపాటు నగలు అపహరించుకుపోయాడు. దీనికి సంబంధించి టూటౌన్ క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాలు...

విశాఖ డాబాగార్డెన్స్‌లోగల లలితా కాలనీలో తైనాల విజయ్‌కుమార్ నివాసం ఉంటున్నారు. ఇద్దరు కుమారులు ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడడంతో భార్యాభర్తలు ఇద్దరే ఉంటున్నారు. విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని ఎస్.కోట నియోజకవర్గ పరిశీలకుడిగా ఉన్న తైనాల విజయ్‌కుమార్ అక్కడ అభ్యర్థుల తరపున ప్రచారంలో పాల్గొంటున్నారు. గురువారం మధ్యాహ్నం ఎంపీ అభ్యర్థిని బొత్స ఝాన్సీలక్ష్మి పర్యటన ఉండడంతో ఆయన అక్కడకు వెళ్లారు. ఆ సమయంలో తైనాల భార్య ఒక్కరే ఇంట్లో ఉన్నారు. రాత్రి ఏడున్నర గంటల సమయంలో ముఖానికి మాస్క్‌తోపాటు నెత్తిన టోపీ పెట్టుకుని ఒక వ్యక్తి ఇంటి ప్రహరీ దూకి లోనికి చొరబడ్డాడు. నేరుగా కిచెన్‌లోకి వెళ్లి అక్కడ వంట పనిలో నిమగ్నమై ఉన్న తైనాల భార్య మెడపై కత్తి పెట్టి చంపేస్తానని బెదిరించాడు. ఆమె మెడలోని బంగారం తాడు, గొలుసుని తీసుకున్నాడు. అనంతరం ఇంట్లో ఉన్న బంగారం, నగదు ఇచ్చేయాలని లేనిపక్షంలో చంపేస్తానని బెదిరించాడు. దీంతో ఆమె బీరువాలో ఉన్న రూ.8 లక్షల నగదు, బంగారాన్ని చూపించడంతో వాటిని తీసుకుని దుండగుడు అక్కడి నుంచి ఉడాయించాడు. ఈ విషయం ఆమె వెంటనే తన భర్తకు చెప్పేందుకు యత్నించగా అక్కడ ప్రచారం హోరులో ఆయన ఫోన్ తీయలేదు. దీంతో తైనాల కారు డ్రైవర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పారు. అతని ద్వారా విషయం తెలుసుకున్న తైనాల వెంటనే ఇంటికి చేరుకున్నారు. తైనాల బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. సమాచారం అందిన వెంటనే డీసీపీ-1 మణికంఠ చందోలు, క్రైమ్‌డీసీపీ వెంకటరత్నం, సీసీఎస్ ఏసీపీ ఎ.వెంకటరావు, టూటౌన్ సీఐ తిరుమలరావు, క్లూస్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

తెలిసిన వారి పనేనని అనుమానం

తైనాల ఇంట్లో జరిగిన దోపిడీ తెలిసినవారి పనే అయివుంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. తైనాల ప్రతిరోజూ మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత ఎస్.కోట వెళుతున్నారని, ఆ సమయంలో ఆయన భార్య మాత్రమే ఇంట్లో ఉంటున్నట్టు గమనించిన వ్యక్తులే దోపిడీకి వ్యూహం పన్ని ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇంట్లోకి చొరబడిన వ్యక్తి తెలుగులో స్పష్టంగా మాట్లాడాడని, మధ్యలో ఎవరో ఫోన్ చేసి ఇంకా రాలేదమని ప్రశ్నిస్తే, పనైపోయింది వచ్చేస్తానని...చెప్పాడని పోలీసులకు తైనాల భార్య తెలిపారు. దీంతో ఇద్దరు స్థానికులు దోపిడీకి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. తైనాల ఇంటి వద్ద సీసీ కెమెరాలతోపాటు ఎదురుగా ఉన్న వైస్రాయ్ విల్లా అపార్ట్‌మెంట్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించిన పోలీసులు ఒకరు ద్విచక్ర వాహనంపై ఇంటి బయట వేచి ఉండగా, ఒకరు ఇంట్లోకి ప్రవేశించినట్టు నిర్ధారించుకున్నారు. సీసీ కెమెరాలతోపాటు సెల్‌ఫోన్ టవర్ లొకేషన్, ఘటనా స్థలంలో లభ్యమైన వేలిముద్రల ఆధారంగా నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ప్రాణం తీసిన ఇసుక గోతులు

గోవాడ వద్ద శారదా నదిలో మునిగి యువకుడి మృతి


యుగంధర్ మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్న అగ్నిమాపక సిబ్బంది (ఇన్‌సెట్‌లో) నదిలో మునిగి చనిపోయిన యుగంధర్


ప్రాణాలతో బయటపడిన రామకృష్ణ

చోడవరం, మార్చి 21:

శారదా నదిలో అక్రమ ఇసుక తవ్వకాలకు ఓ యువకుడు బలయ్యాడు. మండలంలోని గోవాడ వంతెన వద్ద శారదా నదిలో గురువారం మధ్యాహ్నం స్నానానికి దిగిన యువకుడు, ఇసుక తవ్వకాలతో ఏర్పడిన పెద్ద గొయ్యిలో మునిగి మృతిచెందాడు. నీటిలో మునిగిపోతున్న మరో యువకుడిని స్థానికులు కాపాడారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు, ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన యువకుడు తెలిపిన వివరాలిలా వున్నాయి.

గాజువాక దయాళ్‌నగర్‌కు చెందిన పెంటకోట యుగంధర్(31), బీశెట్టి రామకృష్ణ వరుసకు సోదరులు అవుతారు. మాడుగులలో బంధువు ఒకరు చనిపోవడంతో గురువారం ఉదయం అంత్యక్రియలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమం ముగిసిన తరువాత తిరిగి దయాళ్‌నగర్ వెళుతూ మార్గమధ్యంలో గోవాడ వద్ద శారదా నదిలో స్నానం చేసేందుకు ఉపక్రమించారు. తొలుత యుగంధర్ నదిలో దిగి కొంచెం ముందుకు వెళ్లగా.. అక్కడ గతంలో ఇసుక తవ్వకాల వల్ల ఏర్పడిన భారీ గొయ్యిలో పడిపోయాడు. అధిక లోతు వుండడంతోపాటు ఈత రాకపోవడంతో పైకి రాలేక గట్టిగా కేకలు వేశాడు. ఇది గమనించిన రామకృష్ణ... యుగంధర్‌ను కాపాడడానికి నదిలో దిగాడు. ఇతనికి కూడా ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. సమీపంలో వున్న స్థానికులు గమనించి హుటాహుటిన సంఘటన స్థలానికి వచ్చి రామకృష్ణను కాపాడి ఒడ్డుకు చేర్చారు. యుగంధర్ అప్పటికే నీటిలో మునిగిపోయాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. కొద్దిసేపటి తరువాత యుగంధర్ మృతదేహాన్ని వెలికి తీశారు. ప్రాణాలతో బయటపడిన రామకృష్ణను 108 వాహనంలో చోడవరం సీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు.

విశాఖ ఉక్కుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు లోకనాథం ఆరోపణ

అనకాపల్లి టౌన్, మార్చి 21: విశాఖ ఉక్కుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు కె.లోకనాథం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును అన్నిరకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన సొంత గనులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నదన్నారు. అలాగే రూ. ఐదువేల కోట్ల వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వలేదన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుందన్నారు. నిర్వాసితులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఉక్కు పరిశ్రమను కాపాడాలని, లేకుంటే రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు.

సోషల్ మీడియా పోస్టులపై నిఘా

- తప్పుడు సమాచారం ప్రచారం చేస్తే చర్యలు
- అడ్మిన్లు బాధ్యతగా వ్యవహరించాలి
- ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో సోషల్ మీడియా పోస్టింగులు, ట్రోలింగ్స్‌పై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు ప్రచారం చేసినా, ట్రోలింగ్స్ చేసినా తీవ్రంగా పరిగణిస్తామన్నారు. వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ గ్రూపుల్లో అడ్మిన్లు బాధ్యతతో మెలగాలని సూచించారు. అభ్యంతరకరమైన తప్పుడు వార్తలు ప్రచురణ అవుతున్నట్లయితే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. గ్రూపులో ఎవరైన సభ్యుడు అభ్యంతరకరంగా ప్రవర్తిస్తే అడ్మిన్ వారిని గుర్తించి తొలగించాలని సూచించారు.

పోలీస్ కంట్రోల్ రూమ్....

ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు సమాచారం అందించేందుకు వీలుగా పోలీసు కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. సమాచారాన్ని ఫోన్ నంబరు 9440 904229 కు అందజేయాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ప్రధాన గెడ్డలో పైపులు తొలగింపు



గెడ్డలో పైపులు తొలగించిన తరువాత... (ఇన్‌సెట్‌లో) గతంలో గెడ్డలో వేసిన పైపులు

లంకెలపాలెం, మార్చి 21: ప్రైవేటు లేఅవుట్‌కు రహదారి నిమిత్తం ప్రధాన గెడ్డలో కల్వర్టు నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన పైపులను గురువారం నీటి పారుదల శాఖ అధికారులు తొలగించారు. లంకెలపాలెం రెవెన్యూ పరిధి సర్వే నంబరు 143లో ఓ లేఅవుట్‌కు రోడ్డు కోసం ప్రధాన గెడ్డలో అక్రమంగా పైపులు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. దీనిపై 'అక్రమార్కుల అడ్డదారి' శీర్షికన ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో నీటిపారుదల శాఖ అధికారులు స్పందించారు. ఏఈ రామలక్ష్మణ్ తన సిబ్బందితో గురువారం ఆ గెడ్డను పరిశీలించారు. అనుమతులు లేకుండా ఈ విధంగా పైపులు ఏర్పాటు చేస్తే నేరమని లేఅవుట్ నిర్వాహకులకు చెప్పారు. వెంటనే తొలగించాలని, లేకుంటే కేసులు పెడతామని హెచ్చరించారు. దీంతో ఆ వ్యక్తులు ప్రధాన గెడ్డలోని పైపులను తొలగించారు.

మృతిచెందిన హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

అనకాపల్లి రూరల్, మార్చి 21: చోడవరం పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల మృతిచెందిన సీహెచ్ సింహాచలంనాయుడు కుటుంబానికి జిల్లాలోని హోంగార్డులు ఒక రోజు వేతనం రూ.3,91,920 సమకూర్చారు. ఈ నగదును సింహాచలంనాయుడు భార్య లక్ష్మికి గురువారం ఎస్పీ కేవీ మురళీకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విజయభాస్కర్, ఏవో శారదా తదితరులు పాల్గొన్నారు.

మూట్ కోర్టు పోటీల్లో డీఎస్ఎన్ఎల్‌యూ విద్యార్థుల ప్రతిభ

సబ్బవరం, మార్చి 21: మేఘాలయ నేషనల్ లా వర్సిటీ, ఎన్‌హెచ్ఆర్‌సీ సంయుక్తంగా ఈ నెల 15 నుంచి 18 వరకు నిర్వహించిన జాతీయ మూట్ కోర్టు పోటీల్లో స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆ విద్యార్థులను వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు గురువారం అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తమ విద్యార్థులు అథర్వ్ ఆర్ణవ్, కౌశిక్‌శర్మ, అభ్యుదయ్ మిశ్రా బృందం ప్రాథమిక రౌండ్‌లోనే తమ ప్రతిభను కనబరిచి అత్యున్నత ర్యాంక్ పొందిన జట్టుగా నిలిచిందన్నారు. ఈ పోటీల్లో అథర్వ్ ఆర్ణవ్ ఉత్తమ వక్తగా, కౌశిక్ రెండవ ఉత్తమ వక్తగా నిలిచారన్నారు. అభ్యుదయ్ మిశ్రా చేసిన పరిశోధనకు మొదటి బహుమతి లభించిందన్నారు.

జగనన్న.. పార్లే ప్రాజెక్టు ఎక్కడన్నా??

... 5వ పేజీ తరువాయి

ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారుచేసిన కళ్లజోడును పెట్టుకుని మురిసిపోయారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారుచేసిన షూను చూపిస్తూ ఫొటోలకు ఫోజులిచ్చారు. పార్లే సంస్థ విశాఖలోనే రూ.16 వేల కోట్ల పెట్టుబడితో యాన్ తయారీ యూనిట్‌ను ఏర్పాటుచేస్తుందని, దీనివల్ల 20 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రకటించారు. ఈ ప్రాజెక్టులో జీఏఎస్‌పీ సంస్థ ప్లాస్టిక్ వ్యర్థాలపై పోరుకు భాగస్వామ్యులను ఎంపిక చేసుకోవడం, ప్లాస్టిక్ ఏరివేత, పునర్వినియోగంపై వినూత్న ఆలోచనలను రూపొందించడం, దీనికోసం అవసరమయ్యే ఆర్థిక వనరులను సమకూర్చే మార్గాలను గుర్తించడం, గ్రీన్ క్లైమేట్ ఛేంజ్‌కోసం సలహాలు, సూచనలు ఇస్తుందని, 'పార్లే ఫర్ ది ఓషన్స్' సంస్థ తీరం వెంబడి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించడం, వాటిని ఇతర ఉత్పత్తుల తయారీకి అవసరమయ్యే ముడిసరకు (యాన్)గా మార్చి...ప్రపంచంలో పేరొందిన అడిడాస్, మెర్సిడెజ్ బెంజ్, లూయిస్ విట్టన్, అమెరికన్ ఎక్స్‌ప్రెస్ వంటి కంపెనీలకు సరఫరా చేస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల విశాఖ బీచ్ స్వరూపమే మారిపోతుందని, ప్లాస్టిక్ పునర్వినియోగంలో ఏపీ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుందని గొప్పలు చెప్పారు. అయితే ఒప్పందం జరిగి ఏడాదిన్నర అయినా ఆ ప్రాజెక్టుకు సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకుపడలేదు. ఒప్పంద పత్రాలు మార్చుకోవడంతోనే ప్రాజెక్టు కథ ముగిసిపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'పార్లే ఫర్ ది ఓషన్స్' సంస్థతో ఒప్పందం కోసం సీఎం నగరానికి వస్తున్నారంటూ నగర సుందరీకరణ పేరుతో జీవీఎంసీ అధికారులు రూ.లక్షలు వెచ్చించారు. కార్యక్రమ నిర్వహణ కోసం భారీ ఏర్పాట్లు చేయడంతోపాటు ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారుచేసిన ఉత్పత్తుల ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఇంతవరకూ ప్రాజెక్టుకు సంబంధించి కనీసం చర్చ కూడా లేకపోవడం గురించి జీవీఎంసీ అధికారుల వద్ద ప్రస్తావించగా అసలు ఆ ప్రాజెక్టు ఒకటి ఉందనే విషయం తమకు గుర్తులేదన్నట్టుగా మాట్లాడడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.



ఎంఈవోలతో మాట్లాడుతున్న ఏడీ అప్పారావునాయుడు

మెనూ తప్పనిసరిగా అమలు చేయండి

▸▸ ఎండీఎం ఏడీ అప్పారావునాయుడు

చింతపల్లి, మార్చి 21: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు మధ్యాహ్న భోజనంలో మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని ఎండీఎం అసిస్టెంట్ డైరెక్టర్ గిడ్డి అప్పారావునాయుడు ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంపీపీ పాఠశాలను గురువారం సందర్శించి, విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అలాగే విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు మెనూ ఆధారంగా భోజనాలు పెట్టాలన్నారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ప్రతీ రోజు కోడి గుడ్డు ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. అలాగే వారంలో మూడు రోజులు రాగిజావ, మూడు రోజులు చిక్కీ కచ్చితంగా పెట్టాలన్నారు. భోజనాలను ఉపాధ్యాయులు పరిశీలించి రుచి చూడాలన్నారు. భోజన పథకం నిర్వహణ రికార్డులను పూర్తి స్థాయిలో నిర్వహించాలన్నారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం మండల విద్యాశాఖ కార్యాలయాన్ని సందర్శించి ఎంఈవోలతో సమావేశమయ్యారు. ప్రతీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం సమర్థవంతంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-1, 2 పనసల ప్రసాద్, గెమ్మెలి బోడంనాయుడు పాల్గొన్నారు.

ఖరీఫ్ నాటికి కాఫీ రైతులకు పెట్టుబడి రుణాలు

▸▸ జీసీసీ డివిజనల్ మేనేజర్ దేవరాజు



చింతపల్లి, మార్చి 21: ఖరీఫ్ సీజన్ నాటికి కాఫీ రైతులకు పెట్టుబడి రుణాలు పంపిణీ చేస్తామని గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ పి.దేవరాజు తెలిపారు. జీసీసీ ఉద్యోగులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పెట్టుబడుల కోసం దళారీల నుంచి కాఫీ రైతులు రుణం తీసుకుని, కాఫీ పంట చేతికి వచ్చిన సమయంలో దళారీలు నిర్ణయించిన తక్కువ ధరకు విక్రయించుకుని నష్టపోతున్నారని చెప్పారు. గత ఏడాది కాఫీ సీజన్ ప్రారంభానికి ముందు నవంబరులో రుణాలు మంజూరు చేశామని, అయితే ఖరీఫ్ సీజన్‌లో మంజూరు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని ఎండీ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. దీనికి ఎండీ సానుకూలంగా స్పందించారన్నారు. దీంతో ఖరీఫ్ సీజన్ నాటికి రుణాలు పంపిణీ చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించామన్నారు. పాత రుణాలు చెల్లించిన రైతులకు ఈ ఏడాది రుణాల పంపిణీలో ప్రాధాన్యం ఉంటుందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు కాస్త మందగించినప్పటికీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలనే ఉద్దేశంతో పార్చిమెంట్ కిలో రూ.280, చెర్రీ రూ.145, రొబస్టా కిలో రూ.70 ధరలకు కొనుగోలు చేస్తున్నామని ఆయన తెలిపారు. అలాగే తేనె ధరను రూ.200 నుంచి రూ.250కి పెంచినట్టు చెప్పారు. తేనె సేకరిస్తున్న రైతులందరికి ఐడీ కార్డులు జారీ చేస్తున్నామన్నారు. జీసీసీ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



విజేతలకు బహుమతులను అందజేసిన కమాండెంట్ సురేష్‌బాబు

సీలేరు, మార్చి 21: విద్యార్థులు విద్యతో పాటు క్రీడా రంగంలోనూ రాణించాలని సీఆర్‌పీఎఫ్ జీ-42 బెటాలియన్ సెకండ్ ఇన్ కమాండెంట్ సురేష్‌బాబు సూచించారు. సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా గురువారం సీలేరులో విద్యార్థులకు షటిల్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జెన్‌కో ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునన్నారు. అలాగే క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించి ఆరోగ్యవంతంగా ఉండడానికి దోహదపడతాయన్నారు. అనంతరం షటిల్ సింగిల్స్, డబుల్స్ విభాగంలో మొదటి, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సీలేరు పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో సీసీ కెమెరాల ఏర్పాటు



ముంచంగిపుట్టు అంబేడ్కర్ పార్కు సమీపంలో పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

ముంచంగిపుట్టు, మార్చి 21: మండల కేంద్రంలో గురువారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ముంచంగిపుట్టుతో పాటు గ్రామాల్లో కొద్ది రోజులుగా మండల దొంగతనాలు, దారి దోపిడీలు జరుగుతున్న విషయం తెలిసిందే. అలాగే దొంగలు సంచరిస్తున్నారన్న వదంతులు వినిపిస్తున్నాయి. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. దొంగతనాలను, దారి దోపిడీలను అరికట్టేందుకు తగిన చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా అంబేడ్కర్ పార్కు సమీపంలో రెండు కెమెరాను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ కె.రవీంద్ర మాట్లాడుతూ మండల కేంద్రం మీదుగా జోలాపుట్టు, పెదబయలు మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనాలు, పాదచారులు, కొత్తవారి కదలికలపై ఎప్పటికప్పుడు సీసీ కెమెరా ద్వారా పర్యవేక్షిస్తామన్నారు. త్వరలో జడ్పీ అతిథి గృహం, సాయిబాబా జంక్షన్, మెయిన్ రోడ్డు సమీపంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. అపరిచిత వ్యక్తులు తారసపడితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అంబేడ్కర్ సెంటర్‌లో నాడు.. నేడు!





జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద దాదాపు అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు ఉంటాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి రాక ముందు అక్కడ వైసీపీ, టీడీపీ. జనసేన పార్టీలకు చెందిన ప్రచార ఫ్లెక్సీలతో ఉండేది. ఈ నెల 16న ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికార యంత్రాంగం వాటికి తొలగించారు. దీంతో ఇన్నాళ్లు ఫ్లెక్సీలతో ఉండే ఆ స్థలం.. నేడు ఖాళీగా దర్శనమిస్తున్నది. ఎన్నికల కోడ్ ఎఫెక్ట్‌తో మారిన ఆ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' కెమేరాలో బంధించింది.

పాడేరు/ఆంధ్రజ్యోతి

ఎన్నికల నిబంధనల అమలుకు సహకరించాలి

▸▸ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్ విజయసునీత

పాడేరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలుకు అందరూ సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత కోరారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో రాజకీయ నేతల చిత్రాలతో వున్న హోర్డింగ్‌లు, బోర్డులు విధిగా తొలగించాలన్నారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేటు ప్రదేశాల్లోని ప్రచార, రాజకీయ సంబంధ అంశాలను తొలగించాలని చెప్పారు. జాతీయ నేతలు, రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేయాలని, అంబులెన్సులు, పీటీడీ బస్సులు, ఇతర వాహనాలపై వున్న చిత్రాలను తొలగించాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో జరిగే ప్రచారంలో వ్యక్తిగత, మతపరమైన దూషణలు చేయరాదని, అన్ని రకాల ప్రచారాలకు సింగిల్ విండో విధానంలో అనుమతులిస్తామన్నారు. అలాగే ఎన్నికల ప్రచారం కార్యక్రమాలను వీడియో చిత్రీకరణ చేస్తామని, కోడ్ ఉల్లంఘనలకు పాల్పడకూడదన్నారు. ఈ సందర్భంగా నామినేషన్లు, తదితర అంశాలకు దరఖాస్తులు చేసే విధానాలను ఆమె వివరించారు. ఇందుకు సంబంధించి యాప్‌లపైనా వారికి అవగాహన కల్పించి, నామినేషన్లకు చెల్లించాలని నగదు, తదితర విషయాలను కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.అంబేడ్కర్, జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి లీలాప్రసాద్, ఆర్ అండ్ బీ ఈఈ బాలసుందరంబాబు, డ్వామా పీడీ శివయ్య, మీడియా నోడల్ అధికారి పి.గోవిందరాజులు, వివిధ రాజకీయ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా చెరువు సుందరీకరణ పనులు



ముంచంగిపుట్టులో జరుగుతున్న చెరువు సుందరీకరణ పనులు

ముంచంగిపుట్టు, మార్చి 21: మండల కేంద్రంలో చెరువు సుందరీకరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. జడ్పీ నిధులు వెచ్చించి చేపడుతున్న ఈ పనుల్లో చెరువు చుట్టూ చెత్తను తొలగించారు. అలాగే ఆ ప్రదేశంలో మట్టిని వేసి చదును చేస్తున్నారు. ప్రస్తుతం డ్రైనేజీ పనులను చేపడుతున్నారు. ఈ పనులు పూర్తయిన వెంటనే చెరువు చుట్టూ పాదచారులు నడిచే విధంగా వాకింగ్ ట్రాక్, విద్యుత్ దీపాలు, కూర్చొనేందుకు సిమ్మెంట్ బల్లలు ఏర్పాటు చేస్తారు. చెరువు మధ్యలో అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. అలాగే చెరువు పక్కన ఉన్న అంబేడ్కర్ పార్కును సైతం జడ్పీ నిధులు రూ 10 లక్షలు వెచ్చించి సుందరీకరణ పనులు చేపడుతున్నారు. ఈ చెరువు పనులకు సంబంధించి రూ. 30 లక్షలు వెచ్చించారు. ఇప్పటికే 30 శాతం పనులను పూర్తి చేశారు. మిగిలిన పనులను కూడా సకాలంలో వేగవంతంగా పూర్తిచేయాలని జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఇంజనీరింగ్ అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని తెలిపారు. పనులు పూర్తయితే ఈ ప్రాంతమంతా ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందని ఆమె చెప్పారు.

సోషల్ మీడియా సమాచారం నమ్మొద్దు

▸▸ కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి

▸▸ గూడెంకొత్తవీధి సీఐ అప్పలనాయుడు



పిల్లిగెడ్డలో గిరిజనులతో మాట్లాడుతున్న సీఐ అప్పలనాయుడు, పక్కన ఎస్‌ఐ

సీలేరు, మార్చి 21: గిరిజన గ్రామాల్లో దొంగలు సంచరిస్తున్నారంటూ సోషల్ మీడియాల్లో వస్తున్న తప్పుడు వార్తలను నమ్మకూడదని గూడెంకొత్తవీధి సీఐ అప్పలనాయుడు సూచించారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాల్లో దొంగలు సంచరిస్తున్నారంటూ సోషల్ మీడియాల్లో విస్తృతంగా ప్రచారం జరగడంతో మారుమూల ప్రాంతాల గిరిజనులు భయాందోళనతో రాత్రుళ్లు పహారా కాస్తున్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు వస్తే ప్రశ్నిస్తున్నారు. సరైన సమాధానం చెప్పకపోతే చుట్టుముట్టి దేహశుద్ధి కూడా చేస్తున్న సంఘటనలు పలు గ్రామాల్లో జరిగాయి. ఈ క్రమంలో జీకే వీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పిల్లిగెడ్డ గ్రామానికి ఏడుగురు వ్యక్తులు రావడంతో గ్రామస్థులు బాణాలు, కర్రలు పట్టుకుని వెంబడించారు. చివరకు వారిని అటవీ ప్రాంతంలో పట్టుకుని గ్రామానికి తీసుకుని వచ్చి దేహశుద్ధి చేశారు. ఈ సంఘటన సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో ఎస్‌ఐ రామకృష్ణతో కలిసి సీఐ పిల్లిగెడ్డ గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వారిని అదుపులోకి తీసుకుని చట్ట వ్యతిరేకంగా శిక్షించరాదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని, తమకు సమాచారం ఇస్తే తగిన చర్యలు చేపడతామని సీఐ తెలిపారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరం

▸▸ ప్రథమ శ్రేణి జుడీషియల్ కోర్టు జడ్జి ప్రదీప



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి ప్రదీప

పాడేరు రూరల్, మార్చి 21: ఆశ్రమ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు చట్టాలు, హక్కులపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానిక ప్రథమ శ్రేణి జుడీషియల్ కోర్టు జడ్జి పి.ప్రదీప సూచించారు. స్థానిక ఏపీఆర్ బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో గురువారం న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ముందుగా కళాశాల ప్రాంగణాన్ని పరిశీలించిన జడ్జి, అసంపూర్తిగా ఉన్న ప్రహరీ, కళాశాల విద్యార్థినులకు సరిపడే మరుగుదొడ్లు లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటానని ఆమె హెచ్చరించారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. తద్వారా గ్రామానికి, తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు టి.ప్రసాదరావునాయుడు, కోర్టు సిబ్బంది, పాఠశాల, కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళ్లు తేలేస్తున్న కోళ్లు

... 5వ పేజీ తరువాయి

మరణించిన కోళ్లను ఎవరూ ఆహారంగా తీసుకోకూడదు. మరణించిన కోళ్లను ఇతర కోళ్లకు దూరంగా శివారు ప్రాంతాల్లో పాతిపెట్టాలి. ఈ వ్యాధి సోకిన కోళ్లను దూరంగా పెట్టడంతోపాటు ఆరోగ్యవంతమైన కోళ్లు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

టీకాలతో నివారణ

కోళ్లలో కొక్కెర తెగులు వ్యాప్తి చెందకుండా టీకాల ద్వారా నివారించుకోవచ్చు. కోడి పిల్ల దశలోనే మొదటి విడత లసోట(ఎఫ్1) కళ్లలో వేయాలి. ఏడు రోజుల తరువాత బూస్టర్ డోస్, 28 రోజులకు కంటి ద్వారా గాని, ముక్కు ద్వారా గాని టీకా వేయాలి. 70 రోజులకు ఆర్2బి టీకాను కండకు ఇవ్వాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ టీకా ఇవ్వడం వల్ల కొక్కెర తెగులు వ్యాప్తి చెందదు.

హోమియో, ఆయుర్వేద చికిత్స

కొక్కెర తెగులుకు హోమియో, ఆయుర్వేద చికిత్స అందుబాటులో వున్నది. ఆర్సెనిక్ ఆల్బమ్-200 హోమియో మందు చిన్న కోళ్లకు రెండు చుక్కలు, పెద్ద కోళ్లకు ఐదు చుక్కల మందు చొప్పున రెండు పూటలు మూడు రోజుల పాటు పట్టడం ద్వారా వ్యాధిని నివారించవచ్చు. కోళ్లకు కునుకుడు వ్యాధి సోకకుండా ఆయుర్వేద వైద్యంలో చికిత్స ఉన్నది. ఒక కలబంద ఆకు గుజ్జు, 20 మిరియాలు, రెండు టేబుల్ స్పూన్ పసుపు, 10 వెల్లుల్లి రెబ్బలు, ఒక పెద్ద ఉల్లిపాయ కలిపి పేస్ట్‌గా తయారు చేసి వడగట్టుకుని వచ్చిన రసం, మజ్జి, నీళ్లలో కలిపి ఇవ్వడం వల్ల కోళ్లకు వ్యాధి వ్యాప్తి చెందదు.

ఎన్నికల ప్రక్రియలో వలంటీర్లు పాల్గొంటే చర్యలు

నాతవరం, మార్చి 21 : గ్రామ వలంటీర్లు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనవద్దని ఎంపీడీవో జె.రాంబాబు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళి సక్రమంగా అమలు అయ్యేటట్టు చూడాల్సి బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలదేనన్నారు. తహసీల్దార్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ ఇంకా ఎక్కడైన బ్యానర్లు, ఫ్లెక్సీలు ఉంటే వాటిని తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ నరసింహమూర్తి పాల్గొన్నారు.

వలంటీర్, ఆర్‌పీలను దూరం పెట్టాలి

అనకాపల్లి టౌన్, మార్చి 21 : పట్టణానికి వలంటీర్లు, ఆర్‌పీలను నేటి నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు దూరంగా పెట్టాలని దళిత సంరక్షక సోషిత సమితి జిల్లా కన్వీనర్ మామిడి నూకరాజు గురువారం ఆర్డీవో కార్యాలయ డీటీకి ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. ఆర్‌పీలు, వలంటీర్లు అధికార పార్టీకి ప్రచారాలు చేస్తున్నారని, వైసీపీకి ఓటు వేయకపోతే పథకాలు తీసేస్తామని బెదిరిస్తున్నారన్నారు. అందువల్ల ఎన్నికలు పూర్తయ్యే వరకు వారిని విధుల నుంచి దూరం పెట్టాలని డీటీని కోరారు.

ఉపాధి అందించే డ్రాగన్ ఫ్రూట్

... 5వ పేజీ తరువాయి

ముగ్గురేసి లబ్ధిదారులు డ్రాగన్ ఫ్రూట్ సాగు చేపడుతున్నారు.

మూడేళ్ల తరువాత ఎకరానికి రూ.2.25 లక్షల ఆదాయం

ఈ ఏడాది డ్రాగన్ ఫ్రూట్ సాగు చేపట్టిన గిరిజన రైతులకు నాలుగేళ్లకు ఎకరానికి ఏడాదికి రూ.2 లక్షల 25 వేలు ఆదాయం లభిస్తుందని అధికారులు తెలిపారు. లబ్ధిదారుడికి శత శాతం రాయితీపైనే ఈ సాగును ప్రోత్సహిస్తారు. ఒక ఎకరానికి 900 మొక్కలు, రూ.1,33,707 విలువ చేసే 225 స్తంభాలు ఇస్తారు. అలాగే వాటిని పాతినందుకు గాను ఉపాధి కూలీగా రూ.54,260 వేతనంగా ఇస్తారు. దీంతో తొలి ఏడాది మొక్కలు నాటే ప్రక్రియ పూర్తవుతుంది. అలాగే మరో రెండేళ్ల వాటిని సంరక్షించినందుకు గాను ఏడాదికి రూ.15,100 చొప్పున వేతనం అందిస్తారు. దీంతో నాలుగో ఏడాది నాటికి ఒక్కో మొక్కకు 4 నుంచి 5 కిలోల డ్రాగన్ ఫ్రూట్స్ దిగుబడి వస్తుంది. మార్కెట్‌లో కిలో రూ.500 వరకు ధర ఉందని, దీంతో ఎకరానికి తక్కువగా చూసుకున్నా రైతుకు రూ.2 లక్షల 25 వేలు ఆదాయం వస్తుందని ఉపాధి హామీ పథకం అధికారులు తెలిపారు. అలాగే గిరిజన రైతులు వాటి సాగుపై ప్రత్యేక శ్రద్ధకనబరిస్తే మరింతగా దిగుబడి అధికమైన ఆదాయం పెరుగుతుందని ఉద్యానవన శాఖాధికారులు పేర్కొన్నారు.

సంక్షిప్తంగా..

బూటకపు ఎన్నికలను బహిష్కరించండి

ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్

పాడేరు రూరల్, మార్చి 21: రానున్న పార్లమెంట్, అసెంబ్లీ బూటకపు ఎన్నికలను బహిష్కరించాలని మావోయిస్టు పార్టీ ఆంధ్రా-ఒడిశా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన పేరుతో ఓ లేఖ విడుదలైంది. ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాల శాసనసభలకు ఏప్రిల్, మే నెలల్లో జరగనున్న ప్రజలు ఎన్నికలకు దూరంగా ఉండాలని కోరారు. గత 76 ఏళ్లుగా ప్రతీ ఐదేళ్లకు ఒకసారి బడాస్వాములు, దళారీ, నిరంకుశ, బూర్జువ వర్గాల ప్రతినిధి పార్టీలు అధికారంలోకి రావడానికి జరిగే ఎన్నికల ప్రహసనమే మరోసారి జరగబోతుందని పేర్కొన్నారు. దేశంలో పీడిత ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు బదులు అంతర్జాతీయ, విదేశీయ కార్పొరేట్ సంస్థలకు సేవ చేస్తూ, అర్ధ భూస్వామ్యాన్ని పరిరక్షిస్తూ పాత దోపిడీ వ్యవస్థను నిలబెట్టడంలో రాజకీయ పార్టీలు విజయవంతమయ్యాయని లేఖలో పేర్కొన్నారు.

వైసీపీవి మోసపూరిత వాగ్దానాలు

ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్ల క్రితం నవరత్నాల పేరుతో అనేక మోసపూరిత హామీలు ఇచ్చి వైఎస్‌ఆర్‌సీపీ అధికారంలోకి వచ్చిందని మావోయిస్టు నేత గణేష్ ఆ లేఖలో పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధిస్తామని తదితర మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం, ఇప్పుడు అధికారాన్ని కాపాడుకోవడానికి కేంద్ర ప్రభుత్వంతో అవకాశవాద రాజీ పద్ధతులను అనుసరిస్తున్నదని ఆరోపించారు. మూడు రాజధానుల నిర్మాణం పేరుతో నేటికి రాష్ట్రానికి రాజధాని నిర్మాణం చేపట్టలేకపోయారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అప్పుల మయం చేశారాని, ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టారని, ప్రజలపై పన్నుల భారం మోపారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి ఎన్నికలను బహిష్కరించాలని కోరారు.

26 నుంచి తలుపులమ్మ జాతర

చింతపల్లి, మార్చి 21: మండలంలోని తమ్మంగుల పంచాయతీ కేంద్రంలో ఈ నెల 26 నుంచి తలుపులమ్మ తల్లి జాతర నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సలిమితి లక్ష్మయ్య తెలిపారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా మాదిరిగా మూడు రోజుల పాటు అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అమ్మవారి ఆలయంలో రోజూ ప్రత్యేక పూజలు, కుంకుమార్చన, అభిషేకాలు, అన్నదానం జరుగుతుందన్నారు. అలాగే సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. జాతరను ప్రజలు విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు సింహాచలం, కిశోర్‌బాబు, గంగాధర్, మంజు, సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి

పాడేరు రూరల్, మార్చి 21: జిల్లా కేంద్రం పాడేరులో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే వివిధ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని గిరిజన విద్యార్థి సంఘం (జీఎస్‌యూ) జిల్లా కార్యదర్శి బూడిద మాధవరావు డిమాండ్ చేశారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పాడేరులో ఏర్పాటు చేసిన ఐదు కేంద్రాల్లో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, శ్రీకృష్ణాపురం, రాయిగెడ్డ, కందమామిడి, గుత్తులపుట్టు గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలతో పాటు పెదబయలు మండలం తురకలవలస ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పరీక్షలు రాసేందుకు హాజరవుతున్నారని, వారికి బస్సులను ఏర్పాటు చేసిన ఆయా పాఠశాలల యాజమాన్యాలు చార్జీలు చెల్లించాలని చెప్పడంతో ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హాల్ టిక్కెట్ చూపిస్తే చాలు ఉచిత బస్సు సర్వీసు అని ప్రకటించిన ప్రభుత్వం, అధికారులు అమాయకులైన ఆదివాసీ ప్రాంత విద్యార్థుల నుంచి చార్జీల పేరిట డబ్బులు వసూలు చేయడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు స్పందించి టెన్త్ విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. లేకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు అనిల్, కృష్ణ, రామకృష్ణ పాల్గొన్నారు.

అదుపు తప్పిన లారీ



జి.మాడుగుల, మార్చి 21: మండలంలోని మద్దిగరువు ప్రధాన రహదారి పలుసుమామిడి ఘాట్‌లో గురువారం లారీ బ్రేక్ ఫెయిల్‌తో అదుపు తప్పింది. పాడేరు నుంచి ఐరాన్ లోడుతో మద్దిగరువు ప్రాంతానికి వెళుతున్న లారీ బొయితిలి పంచాయతీ పులుసుమామిడి ఘాట్ దిగుతున్న క్రమంలో ఒక్కసారిగా బ్రేక్ ఫెయిలైంది. అయితే డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి రోడ్డు కుడి వైపునకు లారీని అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందని అంతా ఊపిరి తీసుకున్నారు.

కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొయ్యూరు, మార్చి 21: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేకాధికారి పరిమళ తెలిపారు. ఆరో తరగతిలో 40 సీట్లు, ఇంటర్‌లో 40 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. వీటి భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సేకరిస్తున్నామని చెప్పారు. మరిన్ని వివరాలకు పాఠశాల పని వేళల్లో సంప్రదించాలని ఎస్‌వో సూచించారు.

వెంకటస్వామికి ఘన నివాళులు

ముంచంగిపుట్టు, మార్చి 21: ఉపాధ్యాయ ఉద్యమ నేత దివంగత అప్పారి వెంకటస్వామికి యూటీఎఫ్ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. వెంకటస్వామి 23వ వర్ధంతి సందర్భంగా అతని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ వెంకటస్వామి ఉపాధ్యాయ ఉద్యమంలో అలుపెరగని పోరాటం చేశారని, ఆయన సేవలు మరువలేమని చెప్పారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ధర్మారావు, మండల అధ్యక్షుడు రాజు, కార్యదర్శి గోపి, సభ్యులు కూడా శ్రీనివాసమూర్తి, సుబ్బారావు, ధనుపతి, గణేష్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.